ప్రజాశక్తి

మంగళవారం 24 డిసెంబర్ 2024

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



డిఎంహెచ్ఓ సుజాత బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టరు సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పరిపాలన పరమైన సాధారణ బదిలీల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టరు ఎం.పెంచలయ్యను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీతో డిఎం అండ్ హెచ్ఓ పోస్టు ఖాళీ ఏర్పడింది. అనంతపూర్ జిల్లా ఆత్మకూరు రూరల్ హెల్త్ సెంటర్ డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న ఈ అధికారిణికి ఉద్యోగోన్నతిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ అధికారిణి జిల్లాలోని రాజకీయ వత్తిళ్లను అధిగమించి, జిల్లా అధికారుల, ప్రజల మన్ననలను పొందగలరో వేచి చూడాల్సి ఉంది.

బాధ్యతలు స్వీకరిస్తున్న డిఎంహెచ్ఓ సుజాత

వసతి గృహాల్లో అప్పులు తిప్పలు..!

రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై చిన్నచూపు చూస్తుంది. కొత్త కొత్త పథకాల పేరుతో భారీగా నిధులు ఖర్చుచేస్తున్నా సంక్షేమ హాస్టల్ పిల్లల భోజనం, మెస్ ఛార్జీలు మాత్రం పెంచడం లేదు. నాలుగేళ్లుగా మెస్ ఛార్జీలు పెంచలేదు. ధరలు మాత్రం భారీగా పెరిగాయి. నిత్యావసర వస్తువులు సరఫరా చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. విద్యార్థులను పస్తులు పెట్టలేక వార్డన్లు అప్పులు చేసి, భోజనాలు పెడుతున్నారని తెలుస్తోంది. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మెస్ ఛార్జీలు రాలేదు. దీంతో వసతి గృహాల్లో అప్పులు, తిప్పలు తప్పడం లేదు. వరుసగా క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలు ఉండడంతో మరింత అప్పులు కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

- ◆9 నెలలుగా మెస్‌ఛార్జీలు లేవ్..
- ◆వార్డన్లు వడ్డీలతో అవస్థలు
- ◆నాలుగేళ్ల నుంచి పెంచని ఛార్జీలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సాంఘిక సంక్షేమ, బిసి వసతి గృహాల్లో అప్పులు, తిప్పలు తప్పడం లేదు. ప్రతి నెలా జీతాలు వస్తేనే అంతంత మాత్రంగా సాగుతోన్న కుటుంబాల్లో, వసతి గృహాల్లో సుమారు తొమ్మిది నెలల నుంచి మెస్‌బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం చోద్యం చూస్తుంది. జిల్లా వ్యాపితంగా 74 సాంఘిక సంక్షేమ వసతి గృహాలున్నాయి. ఒక్కో హాస్టల్‌లో సుమారు 100 నుంచి 500 మంది వరకు విద్యార్థులున్నారు. మంచి భోజనం, మంచి చదువు, అంటూ ప్రకటనలు చేసే ప్రభుత్వాలు అందుకు అనుగుణంగా ఏలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ప్రతి రోజూ ఒక విద్యార్థికి రూ.40 బిల్లు చెల్లిస్తుంది. కేవలం బియ్యం మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తుంది. గ్యాస్‌తోపాటు, నిత్యావసర వస్తువులు బయట కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ధరలు తక్కువగా ఉన్నప్పుడు కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నారు. ధరలు పెరిగితే ఒక్క కాంట్రాక్టర్ హాస్టళ్ల వైపు తొంగి చూడడం లేదు. పాలు, గుడ్లు, మాంసం, అరటి పండ్లు, బయట కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఒక్క చిక్కీలు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. వైసిపి ప్రభుత్వంలో రెండు నెలల బిల్లులు, కూటమి ప్రభుత్వంలో ఆర్నెల్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నాలుగు సంవత్సరాల క్రితం ఉన్న ధరలకు అనుగుణంగానే మెస్ బిల్లులు చెల్లిస్తున్నారు. కోడి గుడ్డు గతంలో రూ.4 ఉండగా, ప్రస్తుతం రూ.7 వరకు ఉంటుంది. ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4 చెల్లిస్తుంది.ఓ వైపు ధరలు భారీగా పెరగడం, అందుకు అనుగుణంగా ఛార్జీలు చెల్లించకపోవడం, ప్రతి నెలా బిల్లులు ఇవ్వకుండా నెలల తరబడి ఆలస్యం చేయడంతో వసతి గృహాల్లో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. స్టేషనరీ ఉండడం లేదు. స్కీమ్ వర్కులు ఉండాల్సి ఉండగా వారికీ జీతాలు అందడంలేదని తెలిసింది. మరుగు దొడ్ల శుభ్రం చేసే ఆయిల్స్ కూడా అందుబాటులో ఉండడం లేదు. మంచినీరు, మరుగుదొడ్లు, వంటి కనీస వసతులు కనిపించడం లేదు. జిల్లాలోని దాదాపు అన్ని హాస్టళ్లలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

వార్డన్లకు ఇబ్బందులు..!

ప్రభుత్వం సకాలంలో మెస్ బిల్లులు చెల్లించకపోవడం, పెరిగిన ధరలకు అనుకూలంగా ఛార్జీలు లేకపోవడంతో హాస్టళ్ల వార్డన్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు ధరలు తక్కువగా ఉన్నప్పుడు కందిపప్పు, గుడ్లు, నూనెలు ఇతర వస్తువులను కాంట్రాక్టర్లు సరఫరా చేసేవారు. ఇప్పుడు నూనె ఇటీవల కాలంలో రూ.40 పెరిగింది. పప్పులు రూ.110 నుంచి రూ. 200లకు పెరిగాయి. మాంసం ఇతర ధరలు పెరిగాయి. దీంతో ఒక్క కాంట్రాక్టర్ నిత్యావసర వస్తువులు సరఫరా చేయడానికి ముందుకు రావడంలేదు. దీంతో వార్డన్లు తొమ్మిదినెలల నుంచి తమ జీతాలతో విద్యార్థులకు భోజనాలు పెడుతున్నట్లు తెలిసింది. కొందరు వడ్డీలకు అప్పులు చేసుకుంటున్నారు. ఒక్కో హాస్టల్‌కు లక్షల్లో బిల్లులు పెండింగ్ ఉన్నాయి. రానున్న రోజుల్లో క్రిస్మస్, జనవరి, సంక్రాంతి ఉండడంతో ఏం చేయాలో తెలియడం లేదని వార్డన్లు వాపోతున్నారు. అప్పులు కూడా పుట్టడం లేదని, ఇలా ఉంటే విద్యార్థులకు అన్నం పెట్టలేమని కొందరు వార్డన్లు తెలిపారు.

ప్రభుత్వానికి బిల్లులు పెట్టాం..డిడి

ప్రభుత్వానికి బిల్లులు పెట్టామని, బడ్జెట్ రాగానే బిల్లులు చెల్లిస్తామని సోషల్ వెల్ఫేర్ డిడి కె. శోభారాణి తెలిపారు. ప్రభుత్వానికి ఇప్పటికే బిల్లులు పంపామని, వచ్చిన వెంటనే చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పివి నరసింహారావు చిప్రపటానికి నివాళి అర్పిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

పివి నరసింహారావుకు నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు

తెలుగు జాతి గర్వించదగ్గ మహా రాజనీతిజ్ఞుడు పి వి నరసింహారావు అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మాజీ ప్రధాని పి వి నరసింహారావు 20 వ వర్ధంతి సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పివి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కోటంరెడ్డి మాట్లాడుతూ ప్రధాని పీఠాన్ని అధిష్టించిన తెలుగు వ్యక్తిగా పివి నరసింహరావు చరిత్ర సష్టించారన్నారు. మైనారిటీ ప్రభుత్వాన్ని 5 సంవత్సరాలు ఒడుదుడుకులు లేకుండా పాలించడమే కాకుండా సంస్కరణలతో దేశానికి దశ దిశా నిర్దేశించిన మహా రాజనీతిజ్ఞుడు అని కొనియాడారు. అటువంటి వ్యక్తిని కాంగ్రెస్ పార్టీ విస్మరించడం సిగ్గుచేటన్నారు. నిర్వాహకుడు ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ నేత పివి అన్నారు. బ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుడ్లడిన వాసుదేవరావు, కామేశ్వర ప్రసాద్, సీ వీ ఎల్ నరసింహం, పద్య సారస్వత పరిషత్ సభ్యులు పొలవరపు నరసింహారావు, దుర్గా ప్రసాద్, ఆకుల హనుమంతు రావు,తానే మస్తాన్, అంచురు శ్రీనివాసులు, పెంచల్ చౌదరి,సుభాన్ బాషా, భార్గవ రాం, ఎలమంద రెడ్డి, జి వి రెడ్డి, గోపాల్ నాయుడు, మౌళి, శ్రీనివాస రావు, అమరా మోహన్ రావు, ఎంపీ ఆంజనేయులు, సుగుణమ్మ, గౌసియా ఉన్నారు.

హెల్మెట్ రక్షణ కవచం : ఎఎస్పి

ప్రజాశక్తి-నెల్లూరు :హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఎఎస్పి సిహెచ్ సౌజన్య సూచించారు. సోమవారం ఎస్పి కార్యాలయం నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకు హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఎస్పి మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేస్తే సురక్షితమన్నారు. ఒక రక్షణ కవచంలాగా కాపాడుతుందని, ప్రతి ఒక్కరూ ప్రయాణం చేసేటప్పుడు బాధ్యతగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని ప్రజలకు సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం మీ జీవితానికి ప్రమాదకరమని, ప్రజల సంక్షేమం కోసమే పోలీసుల తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని పిలుపు నిచ్చారు. యస్.బి. డిఎస్పి శ్రీనివాస రావు, రూరల్ డిఎస్పి జి.శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పి చంద్రమోహన్,ఏఓ చంద్రమౌళి , టౌన్ సిఐ లు, ఆర్ఐలు, ట్రాఫిక్, డిసిఆర్‌బి, డిపిఓ ఉన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎఎస్పి శైలజ

ఇద్దరు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు :వ్యసనాలకు బానిలసై చోరీలకు అలవాటుపడి జీవనం సాగిస్తున్న ఇద్దరు నిందితులను సంతపేట పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల అరెస్టు, చోరీ సొత్తు, నగదు స్వాధీనం చేసుకున్న వివరాలు వెల్లడించారు. ఈ నెల 15న సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు దొందిలించుకోని పారిపోయినట్లు విజయలక్ష్మి అనే మహిళ ఫిర్యాదు చేసిందన్నారు. ఈ ఫిర్యాదుపై సంతపేట సిఐ ఎం.శ్రీనివాసరావు ప్రత్యేక బృందంతో కేసు దర్యాప్తును వేగవంతం చేశారన్నారు వెంకటేశ్వరపురం వద్ద అనుమానాస్పదంలో తిరుగుతున్న అరవ సుబ్రహ్మణ్యం అలియాస్, రెడ్డి తోట శ్రీనివాసులు అలియాస్ శ్రీనులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా అసలు వ్యవహారం బహిర్గతమైందన్నారు. పోలీసులు విచారణలో నిందితులిద్దరు నేరచరిత్ర కలిగిన వారుగా గుర్తించారన్నారు. నవాబుపేటలో అనుమానితుల రికార్డు, వేదాయపాళెం, రూరల్, కొడవలూరు, నవాబుపేట, కోవూరు పోలీసు స్టేషన్లలో చోరీ కేసులు నమోద య్యాయన్నారు. రాజమండ్రి రంపచోడవరం ప్రాంతంలో గంజాయి కేసు నమోదైనట్లు గుర్తించామన్నారు. ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతోపాటు 49 సవర్ల బంగారు ఆభరణాలు, 149 గ్రాములు వెండి ఆభరణాలు, లక్షరూపాయల నగదు స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న మొత్తం విలువ రూ.20,87,910లు ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు.ఈ నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభను కనపరిచిన వారిని ఎస్పి అభినందించినట్లు తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వీడియో కాన్ఫరెన్సనలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

అర్జీల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

ప్రజాశక్తి -నెల్లూరు :రెవెన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలపై రాష్ట్ర ప్రభుత్వం సునిశిత దష్టి సారించి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక ఆడిట్ టీమ్ లను ఏర్పాటు చేసినట్లుగా జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ తెలిపారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యూటేషన్లు, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు అపార్ ఐడి కార్డులు మంజూరు, ఉపాధిహామీ పనిదినాల పెంపు, పాఠశాలల్లో మనబడి మన భవిష్యత్తు అభివద్ధి పనుల పూర్తి మొదల్కెన అంశాలపై సబ్‌కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడీవోలు, తహశీల్దార్లతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారుజాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందన్నారు. ప్రతి దరఖాస్తును ఆన్లైన్లో సక్రమంగా నమోదు చేయాలని, అక్కడికక్కడే పరిష్కరించే సమస్యను కూడా ఆన్లైన్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. డిఆర్‌వో ఉదయభాస్కర్ , జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి , జడ్పీ సీఈవో విద్యా రమ , హౌసింగ్, డ్వామా పిడి లు వేణుగోపాల్ , గంగా భవాని, డీఈవో బాలాజీ రావు, డిసిఓ గురప్ప, ఆర్డబ్ల్యూఎస్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ ఇ లు వెంకట రమణ, విజయన్, జిల్లా హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి -నెల్లూరు :జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ఎదురైయ్యే ప్రమాదాలు ,కలిగే ప్రాణనష్టం తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీదారులకు ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-నెల్లూరు :విద్యుత్తు సంస్థకు రావాల్సిన రెవెన్యూ బకాయిల వసూళ్లపై సిబ్బంది, అధికారులు దృష్టి సారించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.శ్రీధర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పి.మురళీ పిలుపు నిచ్చారు. సోమవారం కోటమిట్ట లోని విద్యుత్ రెవిన్యూ కార్యాలయంలో నెల్లూరు టౌన్ డివిజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.శ్రీధర్ , సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పి.మురళీ లు మాట్లాడుతూ 33 కె.వి. లైన్లు రెగ్యులర్ గా పెట్రోలింగ్ చేస్తూ ఉండాలని దానివల్ల మనకు లోపాలు తెలుస్తాయని వెంటనే లోపాలను సవరించి వినియోగదారునికి నాణ్యమైన విద్యుత్తును అందించవచ్చన్నారు. నగర డిప్యూటీ ఇంజనీర్లు అశోక్,సునీల్ ,కిరణ్ అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్స్ బొబ్బిలి సురేఖ, ఆశాలత అసిస్టెంట్ ఇంజనీర్స్ లక్ష్మీనారాయణ, మునిశేఖర్, విజయ్ ,గోపాలకష్ణ ,విజయ్ కుమార్, లక్ష్మీ ,దామోదర్, సతీష్ , నస్రుల్ల, రమణ కష్ణవేణి ,ఆచారి ,సూర్యగాంధీ, సురేష్ ఉన్నారు.

కందుకూరును 'ప్రకాశం'లో కలపాలి

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహ కూడలి వద్ద సోమవారం ధర్నా జరిగింది. యాదవ జెఎసి వ్యవస్థ అధ్యక్షులు మిరియం.శ్రీనివాసులు మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతానని బహిరం గంగా ప్రకటన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట తప్పారన్నారు. తక్షణం ప్రకాశం జిల్లాలో కందుకూరు నియోజకవర్గాన్ని కలపాలన్నారు. సీనియర్ న్యాయవాది ముప్పవరపు కిషోర్, మాజీ కౌన్సిలర్ రేణమాల అయ్యన్న, భారత కార్మిక సంఘాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రావినూతల మోహన్, దమ్మచక్ర ఫౌండేషన్ అధ్యక్షులు ఉపాసక గాండ్ల హరిప్రసాద్ మాట్లాడారు. అనంతరం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజితను కలిసి వినతి పత్రం సమర్పించారు. రాళ్లపాడు రైతు కూలీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.సుభాను, దళిత నాయకులు సూర్యం, జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు కాపు సుబ్బారెడ్డి, నాయుడు. ఏడు కొండలు, సవరం. వెంకట్రావు ,ఆల్సూరి. కష్ణారెడ్డి,నక్క.రమేష్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దష్టి సారించడంతోపాటు ఇతర ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, జిల్లా పరిషత్ సీఈవో విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 263 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 127, మున్సిపల్‌శాఖకు సంబంధించి 21, సర్వేకు 12, పంచాయతీరాజ్‌శాఖకు 16, సివిల్ సప్లయిస్‌కు విభాగానికి సంబంధించి 7 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సాను కూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డి ఆర్ డి ఎ, డ్వామా, హౌసింగ్, ఐసిడిఎస్ పీడీలు నాగరాజు కుమారి, గంగాభవాని, వేణుగోపాల్, సుశీల, డిటిసి చందర్, డిఇఓ బాలాజీ రావు, జలవనరుల శాఖ ఎస్ఈ దేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఎస్‌జి జి కృష్ణకాంత్

కార్పొరేషన్ కార్యాలయంలో..

నగరపాలక సంస్థ పరిధిలోని పబ్లిక్ పార్కులు అన్యాక్రాంతం కాకుండా అధికారులు, సచివాలయం కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారునగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, ఇంజనీరింగ్ ఈ.ఈ లు రహంతూ జానీ, శేషగిరి రావు, సి.పి. హిమ బిందు, మేనేజర్ ఇనాయతుల్లా ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో..

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పి జి.కృష్ణకాంత్ ఆదేశించారు. సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి ఆయన హాజరైయ్యారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టంలో 90 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించామన్నారు. తాము స్వీకరించిన ఫిర్యాదలను పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధితులకు చట్టపరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చామన్నారు. అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య , యస్.బి. డిఎస్పి శ్రీనివాసరావు, రూరల్ డిఎస్పి జి. శ్రీనివాసరావు, డిటిసి డిఎస్పి గిరిధర్ రావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌బి-2 సిఐ కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

'రాళ్లపాడు'ను పట్టించుకోని వైసిపి ప్రభుత్వం : ఇంటూరి

ప్రజాశక్తి -కందుకూరు

రాళ్లపాడు ప్రాజెక్ట్ నిర్వహణ కోసం కేటాయించిన నిధులు ఏమయ్యాయని ఎంఎల్ఎ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గత పాలకులను ప్రశ్నించారు. గత పాలకుల నిర్వహణ లోపం వల్లే ప్రాజెక్టుకు ఈ పరిస్థితి వచ్చిందని తెలిపారు. సోమవారం ఆయన కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాళ్లపాడు ప్రాజెక్టుపై రైతులకు ఎటువంటి అపోహలు వద్దన్నారు. రాళ్లపాడు రైతుల చివరి ఆయకట్టు వరకు నీళ్ల అందించే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు.గత ప్రభుత్వంలో ప్రాజెక్టు నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు .కందుకూరును నెల్లూరు జిల్లా నుంచి తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే హామీని త్వరతగతిన అమలయ్యే చర్యలు తీసుంటామన్నారు.పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పార్టీ నాయకులు షేక్ రఫీ రాయపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు మృతి

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

గుడ్లూరు మండలం, పాజర్ల మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు ఉమ్మడి పోలు కోటేశ్వరరావు (58) చెన్నయ్‌లో మృతిచెందారు. ఆయన గతకొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో మెరుగైన వైద్యం కోసం చెన్నయ్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విష మించడంతో సోమవారం మృతి చెందాడు. ఆయన 32 ఏళ్లుగా వివాద రహిత నాయకుడిగా గుర్తింపు పొందారు.ఆయన నియోజకవర్గ వ్యాపితంగా సుపరిచితులు. ఆయన మతిపట్ల టిడిపికి తీరని లోటని ఆ పార్టీ పాజర్ల కమిటీ నాయకులు తెలిపారు. పార్టీ ఓ మంచి నాయకున్ని కోల్పోయిందని మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు తెలిపారు. కోటేశ్వరరావు మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. ఉమ్మడిపోలు కోటేశ్వర రావు మృతదేహానికి ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు టిడిపి జెండాను కప్పి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కోటేశ్వం రావు 32 ఏళ్లపాటు ప్రజా నాయకుడిగా అందరి మన్ననలు పొందారని తెలిపారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఎంఎల్ఎ వెంట గుర్రం మాల్యాద్రి . చుండూరి ప్రసాదు .యాదవ కార్పొరేషన్ సభ్యుడు జనిగర్ల నాగరాజు. పాతల్లపల్లి శ్రీనివాసరాజు .పొట్టేళ్ల మురళి ఉన్నారు.

కోటేశ్వరరావు భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

కోటేశ్వరరావు (ఫైల్)

ఎపి మహిళా సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -కందుకూరు :

పట్టణంలోని సిపిఐ కార్యాలయం ఆవరణంలో ఆదివారం ఎపి మహిళా సమాఖ్య కందుకూరు మండల నూతన కమిటీని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు వి. జయలక్ష్మి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం కందుకూరు మండల అధ్యక్షులుగా మెండా శైలజ, ప్రధాన కార్యదర్శిగా వలేటి కల్పన, ఉపా ధ్యక్షులుగా బెల్లంకొండ జ్యోతి, సహాయ కార్యదర్శిగా పద్మ, కోశాధికారిగా కారంశెట్టి ఇంద్రజ, సభ్యులుగా శీలం వెంకటలక్ష్మి, పొనుగోటి మాధవిలతో కలిపి మొత్తం ఏడుగురితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెండా శైలజ, వలేటి కల్పన

మోడల్ పేపర్లు అందజేస్తున్న దృశ్యం

మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు

వరల్డ్ విజన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ రోజు కందుకూరు సబ్ కలెక్టర్ గారి ఆఫీసులో పదోతరగతి చదువుతున్న 65 మంది విద్యార్థులకు మోడల్ పేపర్లుపంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమని శ్రీ పూజ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఎంఇఓ సుబ్బారెడ్డి వరల్డ్ విజన్ సంస్థ చేస్తున్నటువంటి కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. వరల్డ్ విజన్ సంస్థ మేనేజర్ కె యెషయా, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వై.పుల్లయ్య వలంటీర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని
కళాశాలలను సీజ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -కందుకూరు

నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కళాశాలలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీహర్ష డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. మలినేని సుశీలమ్మ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలన్నారు.మండలంలోనిమలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో గతంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని వార్తలు వెలువడ్డాయన్నారు. దీంతో కళాశాల పేరు మార్చి మలినేని సుశీలమ్మ ఉమెన్స్ కాలేజీ గా ఏర్పాటుచేసి ఫీజుల దందా చేస్తున్నారన్నారు. మలినేని సుశీలమ్మ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లో అనుమతులు లేకుండా ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ పేరుతో స్కూలు నిర్వహించి ఫీజుల దందాకు పాల్పడుతున్నారన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - గుడ్లూరు : పట్టణంలో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరగనున్న సిపిఎం 27వ మహాసభలను జయప్రదం చేయాలని గుడ్లూరు లింగసముద్రం ఏరియా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు పిలుపు ఇచ్చారు గుడ్లూరులోని రామాలశివరావు రెడ్డి హాల్లో సిపిఎం సీనియర్ నాయకులు మద్ది చెట్టి జాలయ్య అధ్యక్షతన సమావేశం సోమవారం జరిగింది ఈ సమావేశంలో జి వెంకటేశ్వర్లు మాట్లాడారు. మహాసభలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో గుడ్లూరు సిపిఎం కార్యదర్శి మల్లికార్జున దామా కష్ణయ్య గుడ్లూరు సిపిఎం కొమరగిరి నాగేశ్వరరావు నీలకూరి తిరుపాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

మద్యం షాపును తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

మండలంలోని పోకూరులో అంబేద్కర్ నగర్ పక్కనే ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జివిబి కుమార్ తెలిపారు. ఆదివారం పోకూరులోని దళితవాడలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో అభిప్రాయాలను తెలుసు కున్నారు దళిత వాడ పక్కనే మద్యం షాప్ పెట్టొద్దని మహిళలు అందరూ ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నా ఎక్సైజ్ అధికారులు ప్రజా ప్రతినిధులకు ఈ విషయాలు పరిగణలోకి తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే ఆ మద్యం షాపును తొలగించాలన్నారు మండల నాయ ుకులు దువ్వూరి జాన్, పోకూరు ఎంపీటీసీ గౌరవ సలహాదారులు నూకతోటి వీరనారాయణ మాట్లాడారు. సిపిఎం వలేటి వారిపాలెం మండల నాయకులు సాదు చెన్నకేశవులు, పర్రె భాస్కరరావు,కెవిపిఎస్ నాయకులు గుండ్లతోటి మాధవమూర్తి తోపాటు గ్రామ యువకులు జగదీష్,వినోద్,ప్రభాకర్ ఉన్నారు. పోకూరులోని అంబేద్కర్ నగర్ పక్కనే ఏర్పాటు చేసిన మద్య షాపును తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం నాయకులు జి వెంకటేశ్వర్లు, జివిబి కుమార్‌తదితరులు నెల్లూరులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు.

నెల్లూరులో కలెక్టర్ కార్యాలయంలో అర్జీ అందజేసిన నాయకులు

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ప్రజా సమస్యలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారం దిశగా సిపిఎం అడుగులు వేస్తుందని మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని గంగపట్నం గ్రామంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజా సమస్యలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ శాఖ కార్యదర్శి వెన్ను వేణు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పల్లిపాలెం బ్రిడ్జి నిర్మాణం పెండింగ్‌లో ఉందని ఎన్నోసార్లు కలెక్టరు, శాసనసభ్యులకు అర్జీల రూపంలో సమర్పించినా, అయినా ఫలితం లేదని వాపోయారు. చనిపోయిన వారిని నీటిలో తీసుకెళ్ళిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజా ప్రతినిధులు, స్థానిక ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ సమస్యపై దృష్టి సారించి నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివ కోటయ్య, ఖాదర్ బాషా, కోనేటి రాము, కోనేటి శీను, సాంబయ్య, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గణిత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కావలి : జాతీయ గణిత దినోత్సవ వేడుకలు సోమవారం నారాయణ స్కూల్ యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణ పాఠశాల ఎ.జి.ఎం భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ రాజేష్, ఎ. నరసింహం పాల్గొని శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాజేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రామానుజన్ అంతటి గొప్పవ్యక్తిత్వ కావాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు గణిత ప్రాజెక్టులు చేసి ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి పట్టణంలోని మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎల్.నారాయణ స్వామి, అధ్యాపక సిబ్బంది శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవ నిజ జీవితం గణిత శాస్త్రంతో ముడిపడి ఉంటుందన్నారు. అలాంటి మహనీయుని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

'గీతాంజలి'లో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-కోవూరు : లీగల్ అవేర్నెస్ వీక్ సందర్భంగా గీతాంజలి ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ వ్యాసరచన పోటీలు వ్యక్తులు తమ ఆలోచనలు, సృజనాత్మకత, విశ్లేషణాత్మక నైపుణ్యాలను అర్థవంతమైన పదాల ద్వారా వ్యక్తీకరించడానికి ప్రోత్సహించే వేదికలు, విమర్శనాత్మక ఆలోచన, సమర్థవంతమైన సంభాషణను ప్రోత్సహించడానికి నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా వ్యాసరచన పోటీలలో పలు అంశాలలో డ్రగ్ అబ్యూజ్, హ్యూమన్ ట్రాఫికింగ్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఫ్రీ లీగల్ ఎయిడ్, బాల్య వివాహాల నివారణపై పోటీలను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీస్ అథారిటీ కార్యనిర్వాహక సెల్ సభ్యుడు మురంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వ్యాసరచన పోటీలు ఎంతో విజయవంతంగా నిర్వహించామని, ఈ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వందమంది పైగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ చైర్మన్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై.మురళీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో ఎం.ఎ.షరీఫ్ పర్యటన

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎం.ఎ.షరీఫ్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం సాయంత్రం 5:45గంటలకు నరసాపురం నుండి రైలు మార్గం ద్వారా బయల్దేరి నేటి తెల్లవారు జామున 1:13 నిమిషాలకు నెల్లూరు చేరుకుని ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. ఉదయం 9:30 నుండి జిల్లా మైనారిటీ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం నగరంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు రోడ్డుమార్గం ద్వారా ఒంగోలు చేరుకుంటారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు : నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను ఎపి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆవిష్కరించారు. సోమవారం నగరంలోని అబ్దుల్‌అజీజ్ స్వగృహంలో అనంతసాగరం ప్రాంతానికి చెందిన మైనార్టీ మతపెద్ద, పీఠాధిపతి సయ్యద్ నజీర్ సాహెబ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో 42వ డివిజన్ టిడిపి నాయకులు షేక్ ఖలీల్ అహ్మద్, జిల్లా ఆవాజ్ కమిటీ సభ్యులు సయ్యద్ అన్సర్ శిష్య బందం తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎం.సుభద్ర తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ పలువురు నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించామన్నారు. వచ్చిన అర్జీలను తక్షణమే పూర్తి చేయాలని సంబంధించి అధికారులకు అందజేసి సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ అనిల్ కుమార్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. నోషనల్ ఖాతా నెంబర్లు తొలగించాలని రెండు, డిజిటల్ సంతకం కోసం ఒకటి, ఆధార్‌కు మార్పు కోసం మరో అర్జీ వచ్చిందన్నారు.

లారీ దగ్ధం

ప్రజాశక్తి-దగదర్తి : మిషనరీతో వెళుతున్న మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ ఉన్న లారీ దగ్ధమైన ఘటన మండల పరిధిలోని అల్లూరు రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం సంఘటన చోటుచేసుకుంది. వివరాల మేరకు నెల్లూరు వైపు వెళ్తున్న లారీ పల్లెరోడ్డు సమీపంలోకి వచ్చేసరికి ఒక్కసారిగా లారీ ఇంజన్ లోంచి మంటలు సమీపంలో ఉన్న దుకాణంపై ఎగిసిపడంతో దుకాణంలో కొన్ని సామాన్లు కూడా తగలబడ్డాయి. జాతీయ రహదారిపై నెల్లూరు వైపు, కావలి వైపు సుమారు 4 కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ సంభవించింది. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు గంట సేపు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందడంతో వెంటనే దగదర్తి ఎస్ఐ జంపాని కుమార్ ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను కమబద్ధీకరించి, కావలి అగ్నిమాప సిబ్బందికి సమాచారం ఇచ్చారు.

రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నెల్లూరులో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్ ఆధ్వర్యంలో కౌలు రైతుసంఘం నాయకులు గంటా లక్ష్మీపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్ట్ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరు నగరంలో జరుగుతున్నాయని ప్రజలందరూ జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. 1978లో నెల్లూరులో జక్కా వెంకయ్య, పుచ్చలపల్లి సుందరయ్య ఆధ్వర్యంలో జరిగాయని తెలిపారు. మళ్లీ 46 సంవత్సరాల తర్వాత రాష్ట్ర మహా సభలు ఇప్పుడు నెల్లూరులో జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో, దేశంలో రాజకీయ పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని, నిరుద్యోగం, అధిక ధరలపై ఈ మహాసభలలో చర్చిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజలపై భారం వేసిందని విద్యుత్ ఛార్జీలు పెంచారని, నిరుద్యోగుల ను సైతం పట్టించుకోలేదని, విసిగి వేసారిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి అధికారాన్ని ఇచ్చారు. గెలిచిన ఎన్‌డిఎ ప్రభుత్వం ఈ ఆరు నెలల్లో ఇచ్చిన పలు రకాల హామీలను ఏమాత్రం నెరవేర్చ లేదని తెలియజేశారు. జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు టిడిపి నాయకులు రైతుల మోటార్లకు మీటర్లు బిగించరాదని, ట్రూ అప్ ఛార్జీలు, అధిక విద్యుత్ ఛార్జీలు వసూలు చేయకూడదని, తాము అధికారం లోకి వస్తే తగ్గిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పిందని, కానీ అది ఇంతవరకు నెరవేర్చలేదని విమర్శించారు. నెల్లూరులో జరిగే మహాసభలో ఈ సమస్యలన్నింటిపై, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. కాబట్టి జిల్లాలోని యావన్మంది ప్రజలు, నిరుద్యోగులు, రైతు సోదరులు ఈ రాష్ట్ర మహాసభ సందర్భంగా జరిగే ర్యాలీలో అశేషంగా పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో మండల మాజీ సిపిఎం కార్యదర్శి అస్లాం, సిఐటియు నాయకులు గయాజ్, నాయకులు దిలియాజ్, సలాం, ఎస్‌డి మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతి

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కావలి : పట్టణంలోని ట్రంకు రోడ్డుపై విచ్చలవిడిగా సంచరిస్తున్న ఆవులను నియంత్రించి వాహన దారులను ఆదుకోవాలని టివిఎస్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ తోట.వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, సోమవారం ఆర్‌డిఒ ఎం.సన్నీవంశీకృష్ణకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఆవుల పెంపకం దారులు తమ ఆవులను ట్రంకు రోడ్డుపై కావలి పురవీధుల్లో వదిలివేయడం వల్ల ప్రజలకు వాహనదారులకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా ఆవులు రోడ్లపై ఉన్న ప్లాస్టిక్ కవర్లను తినడం ద్వారా అనారోగ్యపాలవడమే గాక, తద్వారా అవి విడుదల చేసే పేడ దుర్వాసన కలిగిస్తుందని, కావున ఆవులను బందెల దొడ్డికి తరలించి, యజమానులను హెచ్చరించి, కావలి పట్టణ ప్రజలకు, వాహన దారులకు ఉపశమనం కలిగించాల్సిందిగా వారు వినతిపత్రం సమర్పించారని తెలియజేశారు.

రోడ్డు పనులు పరిశీలన

పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి : కావలి – తుమ్మలపెంట రోడ్డు పనులను కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సోమవారం పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడొద్దని, పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. కాగా తుమ్మలపెంట రోడ్డును 2024 డిసెంబర్ 31 అర్ధరాత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలతో ప్రారంభిస్తానని ఎం.ఎల్.ఎ. కృష్ణారెడ్డి వాగ్దానం చేసి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన రోడ్డు పనులను పరిశీలించామన్నారు.

ఉపకరణాలు అందజేస్తున్న దృశ్యం

ఉపకరణాలు బహూకరణ

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కొండ బిట్రగుంట గ్రామంలో ఉన్న మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దులూరి ప్రసాదరావు ఆధ్వర్యంలో రామిశెట్టి సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు విద్యా ఉపకరణాలు, మీల్స్ ప్లేట్స్, పాఠశాలకు మెగామైకును ట్రస్ట్ చైర్మన్ రామిశెట్టి వెంకట సుబ్బారావు సోమవారం బహూకరించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు పి.నరసింహారావు, ఎం.జయమ్మ పాల్గొని మాట్లాడారు. దాతల సహాయంతో పాఠశాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్న ప్రధానోపాధ్యాయులను అభినందించారు. ట్రస్ట్‌చైర్మన్ రామిశెట్టి సుబ్బారావు మాట్లాడుతూ తమ ఆదాయంలో కొంత భాగం విద్యాభివృద్ధికి ఖర్చు చేస్తున్నానని, దానం ద్వారా తృప్తి చెందుతున్నానని, భవిష్యత్తులో ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మండలంలో అనేక మంచి కార్యక్రమాలు రూపొందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్టు కన్వీనర్ మెతుకు రాజేశ్వరీ, విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ డి.మధు, యు కౌసల్య, సహోపాధ్యాయిని డేగా.విజిత, మహాజన సైన్యం జాయింట్ సెక్రటరీ కె.శ్రీకాంత్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-అల్లూరు

మండల పరిధిలోని వెస్ట్ గోగులపల్లిలో టిడిపి నాయకులు సోమవారం సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆట తిరుమల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వచ్చి టిడిపి సభ్యత నమోదు కార్డుకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. ఆడపడుచులు అయితేనేమి, యువకులు అయితేనేమీ, అన్నదమ్ములు అయితేనేమి ప్రతిఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకుని దాని ద్వారా వచ్చే ప్రయోజనాలు పొందాలని తెలియజేశారు. ఆయనతోపాటు నీటి సంఘం అధ్యక్షుడు కాలాస్త్రి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆట మనోజ్, టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-ఎఎస్‌పేట



సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి ఆనం

మండలంలోని అనుమసముద్రం గ్రామానికి చెందిన కంకణాల లక్ష్మీదేవమ్మ భార్య హజరత్తయ్య అను ఆమెకు గుండెవ్యాధి ఉండడంతో సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.1,20,583 చెక్కును అందజేశారు. సిఎం చంద్రబాబు పేద కుటుంబాల సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి అందజేస్తున్నారని మంత్రి అన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజక వర్గ టిడిపి సీనియర్ నాయకులు కిమ్స్ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు తాళ్లూరి గిరినాయుడు, ఏఎస్ పేట మండల సీనియర్ నాయకులు పులిమి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. తదనంతరం ఆ కుటుంబ సభ్యులు మంత్రిగారికి, అత్యంత చొరవ చూపిన ఎఎస్‌పేట నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఆత్మకూరు బస్టాండ్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-నెల్లూరు

తనిఖీలు నిర్వహిస్తున్న సురేష్‌రెడ్డి

నగరంలోని శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మకూరు బస్టాండ్‌లో సోమవారం ఆకస్మికంగా నెల్లూరు ఆర్‌టిసి జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ఇక్కడికి రావడం జరిగిందని, 200 పైగా బస్సులు వివిధ ప్రాంతాలకు, వివిధ జిల్లాలకు ప్రయాణిస్తుంటాయని, ప్రజలు కూర్చోవడానికి తగిన కుర్చీలు లేవని నాశరకంగా ఉన్నాయని, ఎంఆర్‌పి రేట్లకే అమ్ముతున్నారా లేదా అనే విషయాన్ని వ్యాపారస్తులు దగ్గరే అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాన న్నారు. పరిసరాల పరిశుభ్రత ఇంకొంచెం మెరుగుపడాల్సిన అవసరం ఉందని టాయిలెట్స్ కానీ, ప్రధానంగా ట్రాఫిక్ సమస్యను కూడా పరిష్కరించాలని ఇంతకుముందు ఎస్‌పిని కోరారని, మారుమూల ప్రాంతాలకు కూడా మరిన్ని బస్సులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శివ కేశవ్, సునీల్ సుబ్బరాజు చిలకా ప్రవీణ్ కుమార్,ముని, చైతు, బండారు సురేష్ నాయుడు, తదితరులున్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

తనిఖీలు నిర్వహిస్తున్న ఎడిఎ దేవసేనమ్మ

మండలంలోని, మున్సిపాలిటీలోని సిండికేట్ ఫార్మర్ సొసైటీ కోఆపరేటివ్ సొసైటీ, గ్రోమోర్ సెంటర్‌లలో ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.దేవసేనమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎడిఎ ప్రస్తుతం మండలంలో 50 ఎంటిబి, రైతులకు అందుబాటులో ఉందని యూరియా కొరత లేదని రైతులకు అవసరమైనంత వరకు, యూరియా సరఫరా చేస్తామని తెలియజేశారు. ప్రయివేటు ఎరువుల దుకాణదారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించినట్లయితే చర్యలు తీసుకుంటున్నారు. ఎంఆర్‌పి కంటే ఎక్కువ రేటుకు అమ్ముకోవద్దని వేరే ఎరువుతో లింకుపెట్టి అమ్మిన, కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. రైతులు యూరియాను నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని, యూరియా కొనుగోలు విధానములో స్థానికులకు, చిన్న, సన్న కారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.కిషోర్ బాబు, సిండికేట్ ఫార్మర్ సొసైటీ సొసైటీ, గ్రోమోర్ సిబ్బంది ఉన్నారు.

వినతులు పరిష్కరించండి సారూ..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

నడకుడి – శ్రీకాళహస్తి నూతన రైల్వే మార్గం ఏర్పాటులో భాగంగా తమ భూములు సేకరించారని అయితే వీటిలో జరిగిన అవకతవకలను పరిశీలించి న్యాయం చేయాలని ఆయా గ్రామాల రైతులు ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రాలు చేశారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేను ఎఒ నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని మరిపాడు, మర్రిపాడు, చేజర్ల, ఆత్మకూరు మండలాల రైతులు ఎఒకు వినతిపత్రం అందజేశారు. గ్రీవెన్స్ డేకు పలు సమస్యలపై 8 అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ వినతులకు ప్రాధాన్యతనిచ్చి త్వరలోనే పరిష్కరిస్తామని ఎఒ నిరంజన్ తెలియజేశారు.

వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గురుకులంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-సంగం

సంగంలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు జ్వరాలతో బాధపడుతుండడంతో ప్రిన్సిపల్ సుమతి విద్యార్థులను స్థానిక పిహెచ్‌సికి పంపి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విషజ్వరాలు లేవని.. సాధారణ జ్వరాలు మాత్రమే అని తెలిపారు. అధికూడా నలుగురు విద్యార్థులకు మాత్రమే జ్వరాలని తెలియజేశారు. భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సంగం బిట్ –3 పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని డిగ్రీ కళాశాలలో సోమవారం డ్రగ్స్ నివారణ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు డ్రగ్స్ నివారణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు విద్యార్థులు లోను కాకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కిమ్స్'లో ప్రీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు : నెల్లూరు నగరంలో కిమ్స్ హాస్పిటల్‌లో సోమవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరి నాయుడు ఘనంగా నిర్వహించారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే సూపర్‌స్పెషలిస్ట్, స్పెషలిస్ట్ డాక్టర్‌లు, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది టెక్నీషియన్స్, హౌస్‌కీపింగ్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటగా ముఖ్య అతిథులు కార్యక్రమంలో క్రీస్తు జననం ఉపన్యసించి శాంటాక్లాజ్, సిబ్బందితో కేక కట్ చేయించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్‌లకు, సిబ్బందికి పలు రకాల ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు మాట్లాడుతూ 24గంటల పాటు వైద్య చికిత్సలు అందించే సిబ్బందికి ఊరటగా అప్పుడప్పుడు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పని ఒత్తిడి తగ్గించుకోవచ్చని, అన్ని విభాగాల సిబ్బంది శాంతి, సహనం అలవర్చుకుని, తమ విధులను నిర్వర్తిస్తూ పేషంట్లకు అత్యుత్తమ సేవలను అందించాలని కోరుతున్నామన్నారు.

కిమ్స్ హాస్పిటల్‌లో...

కొండాయపాలెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్ రావు ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహిం చారు. ఈ వేడుకల్లో భాగంగా నిరుపేద విద్యార్థినీ విద్యార్థులకు నూతన దుస్తులు పంపిణీ చేయడంతోపాటు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా పిల్లల డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిజిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషా కిరణ్, 20వ డివిజన్ కార్పొరేటర్ చేజర్ల మహేష్ బాబు విచ్చేసి మాట్లాడుతూ పేద ప్రజలకు సహాయం చేయడమే నిజమైన క్రిస్మస్ అని, నిన్ను వలె నీ పొరుగు వారిని చూడాలని పిలుపునిచ్చారు. పాస్టర్ గడ్డం హనోక్ క్రిస్మస్ సందేశం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వర రావు, గ్రామస్తులు డేవిడ్ వెంకటేశ్వర్లు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ పరిధిలో సోమవారం 36వ వార్డు పెంకుల ఫ్యాక్టరీ గిరిజన సంఘం, 38వ వార్డు వైకుంఠ పురం కల్వర్ట్ పాయింట్ల వద్ద, పరిసర ప్రాంతాలలో ప్రస్తుత పరిస్థితులలో ప్రజలకు దోమల బెడద నియంత్రణ కోసం మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు కావలి పురపాలక సంఘ పారిశుధ్య విభాగము ఫాగింగ్ నిర్వహించారు. ఇకపై ప్రతిరోజూ ఫాగింగ్ కార్య క్రమం నిర్వహిస్తామన్నారు.

హెల్మెట్ ధరించాలని ర్యాలీ

ప్రజాశక్తి-సంగం

సంగంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై, హెల్మెట్ ధరించాలని సోమవారం సిఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుండి గ్రామంలోని పలు వీధులలో వారు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్ స్టాండ్ సెంటర్‌లో హెల్మెట్‌లు ధరించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ వేమారెడ్డి మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని తెలిపారు. హెల్మెట్ ధరించకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ జాకీర్ బాషా, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-ఉదయగిరి

మానవ విలువల చైతన్య ప్రచార కేంద్ర స్థాపన కోసం జ్ఞానా విజ్ఞానాలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మానవ విలువల చైతన్య ప్రచార వేదిక కమిటీ వారు, వెలుగొండ ప్రాజెక్టు సాధన ఐక్యవేదిక కమిటీ వారు తీర్మానాన్ని చేశారు. సోమవారం స్థానిక కొట్నిస్ హాస్పిటల్ ఆవరణంలో ఈ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిని పిలిచి వారితో ప్రజలకు మానవీయ విలువలకు సంబంధించి వివిధ రంగాలకు సంబంధించిన జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని అందించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో కడప, ప్రకాశం, నెల్లూరు నేతలు పాల్గొని తీర్మానం చేశామన్నారు. రాజకీయాలకు అతీతంగా వచ్చే వెలుగొండ ప్రాజెక్టుకు మద్దతునించి మానవ విలువలు వేదికకి నిర్మాణానికి ప్రణాళిక నిధుల సమీకరణ తదితర అంశాలను చర్చించామన్నారు. ముఖ్యంగా జనవరి మొదటి వారంలో నెల్లూరులోనూ తర్వాత ఒంగోలులోనూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కమిటీతో అఖిలపక్ష సదస్సు జరపాలని, అలాగే విజయవాడ, విశాఖపట్నంలలో అఖిలపక్ష సదస్సులు నిర్వహణ బాధ్యతలను సమన్వయం చేసుకోవడానికి వీలుగా కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కనిగిరి ముక్కు బాలకృష్ణారెడ్డి, కడప జిల్లా నుండి నారాయణరెడ్డి, సిఆర్‌వి ప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, ఆంజనేయులు, నెల్లూరు జిల్లా నుండి శివశంకరయ్య, ఫండ్స్ రమణయ్య, అజయ్ ఘోష్, అశోక్ రెడ్డి, గౌతమ్ శాతకర్ణి, జెవివి సీనియర్ నాయకులు దస్తగిరి అహ్మద్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

నోటీసు

మహారాజశ్రీ ఒంగోలు ఫ్యామిలీ జడ్జివారి కోర్టులో

యఫ్.సి.ఓ.పి. 102/2024

కాకర్ల వెంకట కళ్యాణి – పిటిషనర్

మరియు

కాకర్ల సుబ్బారావు,
తండ్రి (లేట్) **కాకర్ల సుబ్బరాయుడు,**
R/o చుండూరి రమణమ్మ, డోర్ నెం:2-91,
విక్కిరాలపేట, కందుకూరు, నెల్లూరు జిల్లా.
ఆంధ్రప్రదేశ్. – రెస్పాండెంట్

పై నెంబరు యఫ్.సి.ఓ.పి లో శ్రీ కోర్టు ద్వారా పలుమార్లు నోటీసులు పంపిననూ నోటీసు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున గౌరవ కోర్టువారు ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు అందజేయమని **తేది:26-12-2024** కి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు **ఉదయం 10.30 నిమిషాలకు** పై తెలిపిన కోర్టునకు స్వయంగా గానీ లేదా ప్లీడరు ద్వారా గానీ హాజరు కావలసిందిగా తెలియజేయుచున్నాను. లేని ఎడల మీ పరోక్షంలో తీర్మానించబడును.

"కోర్టువారి ఉత్తర్వులు మేరకు"

వాయిదా తేది: **26-12-2024**

ఇట్లు,
ఏల్చూరి సురేంద్రబాబు,
పిటిషనర్ తరపు న్యాయవాది,
గోల్డెన్ టవర్స్, ఒంగోలు,
ఫోన్: **94404 32700**